ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- చక్రదేవరపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : చక్రదేవరపల్లిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పార్టీ ప్రచారానికో, ఓట్లు అభ్యర్థించడానికో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించడం లేదని, పాలనలో అర్హులకు ఏవిధంగా లబ్ధి చేకూరిందని తెలుసుకోవడానికి, ముమ్ముందు ఇంకా ఎలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలో తెలుసుకోవడం కోసమే పర్యటిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, పరిపాలన చాలా బాగుందని చెబుతూ లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత తెలియజేస్తుండడం తమకు సంతోషంగా ఉందని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామంలో పథకాలు అందలేదని కొంతమంది చేసిన ఆరోపణలపై వెంటనే పరిశీలన చేపట్టామని, పథకాలు అందలేదని చెప్పిన కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రైతు భరోసా అందడం జరిగిందన్నారు. పథకాలు అందినా ఎందుకు రాజకీయం చేస్తున్నారో వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. తన దృష్టికి వచ్చిన రోడ్లు, డ్రెయినేజీల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు, ప్రతి ఎమ్మెల్యేకి రూ.2 కోట్ల నిధులు అందుబాటులో ఉంచారన్నారు. సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేస్తూ వస్తున్నామని, అవసరం మేరకు ఎమ్మెల్యేలకు ఇచ్చిన నిధులను కూడా గ్రామాలకు కేటాయిస్తున్నామన్నారు. నిధులు ఉపయోగించి చక్రదేవరపల్లి గ్రామంలో మౌలిక సదుపాయాలను అందిస్తామన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు

జూన్, జూలై నాటికి రోడ్లన్నీ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే ఎలీజా చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో తాను రోడ్ల విషయమై మాట్లాడానన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో అవసరమైన రోడ్ల నిర్మాణంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. డీఈ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చింతలపూడి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణంపై చర్చించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సర్పంచ్ సాయిల సత్యనారాయణ, పార్టీ నాయకులు కొలనువాడ సాయిరాజు, గురజాల పార్థసారథి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వర్జీనియా తోటల పరిశీలన


జంగారెడ్డిగూడెం-1 వేలం కేంద్రం పరిధిలో వర్జీనియా తోటలను పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రసాద్

జంగారెడ్డిగూడెం : వర్జీనియా తోటల్లో నల్లమచ్చ తెగులు, పొటాషియం లోపం గుర్తించినట్లు వర్జీనియా వేలం కేంద్రం అధికారి జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం -1 పరిధిలోని ముప్పినివారిగూడెం, దొరమామిడి, కోటనాగవరం గ్రామాలను మంగళవారం వేలం కేంద్రం అధికారులు క్షేత్రపర్యటన చేశారు. ఈ సందర్భంగా వర్జీనియా తోటలను వారు పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే నాణ్యమైన పొగాకు ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వేలం అధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో కె.శ్రీధర్, ఐటీసీ ప్రతినిధి చారువాక, జీపీ ప్రతినిధి రవి, పీఎస్ఎస్ ప్రతినిధి నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యాడ్జీలతో బ్యాంకు ఉద్యోగుల నిరసన

టి.నరసాపురం : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బ్యాడ్జీలు ధరించి బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం బ్యాంక్ ఎదురుగా కొద్ది నిమిషాలు బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగులు మాట్లాడుతూ ఐదు రోజుల పనిదినాలను అమలు చేయటం, అదేవిధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం తదితర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. బ్యాంకులో ఆఫీసర్, క్లర్క్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 30 31 తేదీలలో సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

జంగం దేవరలకు దుప్పట్ల పంపిణీ


జంగం దేవరలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కామవరపుకోట : సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు గ్రామ పర్యటన చేసే జంగం దేవరలను ఆదరించాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని సోషల్ వర్కర్ వీరమల్ల మధు అన్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా జంగాలపల్లి చెన్నవరపట్నం నుంచి కామవరపుకోట మండల పర్యటనకు వచ్చిన 9 మంది జంగం దేవరలకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. జంగం దేవరుల సభ్యులు బాలకోటయ్య మాట్లాడుతూ సమస్త జనులు శివుని కరుణాకటాక్షాలతో ఆరోగ్యం, అభివృద్ధితో తులతూగాలని కోరుతూ జంగం దేవరలు పర్యటన చేస్తారన్నారు. పూర్వకాలంలో జంగం దేవరలను ప్రజలు భక్తితో ఆదరించే వారిని, ఆధునిక కాలంలో పూర్తిగా ఆదరణ కరువైందని వాపోయారు. కార్యక్రమంలో వీరమల్ల భాను, పండూరి రామసాయి, సొజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

కొయ్యలగూడెం : స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలగల దుర్గారావు మాట్లాడుతూ బీసీ జన గణన చేపట్టాలని, కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు 50 శాతం అసెంబ్లీ స్థానాలను కల్పించాలని కోరారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇదే నిష్పత్తి అమలు చేయాలన్నారు. అలాగే ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మూడు అసెంబ్లీ స్థానాలు బీసీలకు ఇవ్వాలని కోరారు. తొలుత ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కట్టా శ్రీనివాస్, సురవరపు గోపాలరాజు, మువ్వ వెంకటేశ్వరరావు, కృష్ణ కట్టా రాము తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక అక్షరాభ్యాసాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి వారి క్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో గురువారం మాఘశుద్ధ పంచమి (వసంత పంచమి)ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అమ్మవారికి అభిషేకాలు, ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు, సాయంత్రం 4 గంటలకు కుంకుమార్చనలు నిర్వహిస్తున్నామన్నారు.

మైనర్ బాలికను అపహరించిన కేసులో వ్యక్తికి రిమాండ్

చింతలపూడి : చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల మైనర్ బాలికను అపహరించిన కేసులో భూక్యా కళ్యాణ్ అనే యువకుణ్ణి అరెస్ట్ చేసినట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఆయన చెప్పారు.

వాహనాల వేలం

చింతలపూడి : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. వేలంలో 8 వాహనాలకు గాను రూ.91,200 ఆదాయం వచ్చినట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు.

నేడు, రేపు పీపీఏ బృందం పర్యటన

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) బృందం సభ్యులు రెండురోజుల పాటు పరిశీలించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సీఈవో) శివనందన్ కుమార్, మెంబర్ సెక్రటరీ ఎం.రఘురామ్, చీఫ్ ఇంజినీర్ రాజేష్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజు కోలుకోవాలని ప్రార్థనలు


నిర్మలగిరి మేరీమాత కొండకు మోకాళ్లపై నడిచి వెళుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొయ్యలగూడెం : పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రార్థిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్మలగిరిలో మోకాళ్లపై కొండమీదకు నడిచి వెళ్లారు. మంగళవారం ఎమ్మెల్యే బాలరాజుకు తీవ్ర అస్వస్థత కలగడం, రాజమండ్రిలో ప్రైవేట్ హాస్పిటల్లో ఆయన గుండె సంబంధిత అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో జగనన్న మండల సచివాలయాల కోఆర్డినేటర్ నూకల రాము ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీమాత విగ్రహం నుంచి తిరుమలగిరికి మోకాళ్లపై నడుస్తూ బాలరాజు కోలుకోవాలని ప్రార్థించారు. అనంతరం నిర్మలగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్, ప్రధాన పాస్టర్ జాన్ పీటర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మేరీ మాత ప్రసాదాలను పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న బాలరాజుకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేతలు యడ్లపల్లి సురేష్, ఘంటసాల మధు, పల్లంట్ల శ్రీను, మారిశెట్టి శ్రీను, నిక్కర్ నాగేశ్వరరావు, చిటికెన నాగార్జున, శ్రీను, మడుతూరి శ్రీను, షేక్ లియా, ఎం.అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి


తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

కుక్కునూరు : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచి గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఫేస్‌యాప్ విధానం రద్దు చేయాలని లేదంటే ఫిబ్రవరి 6వ తేదీన కలెక్టరేట్ వద్ద పెద్దెత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాయి రమణ, నాగలక్ష్మి, కణితి మంగ, విమల, జయ, జయసుధ, విజయ, రూపాలత, అలివేలు, అన్నపూర్ణ, నాగమణి, ఝాన్సీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

జంగారెడ్డిగూడెం : కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వ ఆస్తులను, పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎంతోమంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు మన అందరి హక్కు అని ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. 30వ తేదీన ఉక్కు నగరంలో నిర్వహించే కార్మిక గర్జనలో వేలాదిమంది పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపేంత వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన దీక్షలో 150 మంది సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునీర్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనర్ నన్నేపల్లి సాయిబాబు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ నాయకులు సోడెం వెంకటేశ్వరరావు, జీవీ రమణరాజు, టీవీఎస్ రాజు, కంకిపాటి బుచ్చిబాబు, జమ్మి శ్రీనివాస్, బాడిస రాము, ఎం.వెంకటాచారి, కొప్పుల నాగరాజు, అయితా సురేష్, కుంచె వసంతరావు, పోతన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి

కామవరపుకోట : పేదలకు ప్రభుత్వం ఇచ్చిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అజెండా కార్యక్రమాలపై ఎంపీడీవో కె.శ్రీదేవి వివరించారు. తడికలపూడి సొసైటీ చైర్మన్ గుర్రాల రవి మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో అధికారులు ప్రజలకు నివాస యోగ్యమైన స్థలాలు కేటాయించాలని, మండలంలో కొన్ని ప్రాంతలో ఇండ్ల స్థలాలు శ్మశానానికి సమీపంలో, ఊరికి చివర ఉండటంతో లబ్ధిదారులు నివాసం ఉండటానికి ఇష్టపడటం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో జగనన్న ఇళ్ల పథకం పెట్టారని, ఈ దిశగా అధికారులు స్పందించాలన్నారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, ఎంఈఓ డి.సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కనికెళ్ళ రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలాధికారులు పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం, పాలు అందజేత


ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అల్పాహారం, పాలు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని మానవత సంస్థ అధ్యక్షుడు మహంకాళి రంగ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులు 100 మందికి ఉదయం అల్పాహారం, పాలు అందజేశారు. వరుసగా 3వ రోజు మానవత సంస్థ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం సభ్యులు ఎల్ఐసీ కృష్ణమూర్తి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు రంగప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ బీబీ కమల, డాక్టర్లు వజ్రకిరణ్, సునీత, మానవతా ఉపాధ్యక్షురాలు త్రిపుర, జిల్లా కమిటీ మెంబర్ ఏలికె తాతారావు, జాయింట్ సెక్రటరీ ధల్లి కేదారేశ్వర రెడ్డి, గంధం గోపాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ఆడపిల్ల.. భారమంటే ఎలా

- ఘనంగా జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం
- పలుచోట్ల విద్యార్థినుల ర్యాలీ


రావికంపాడులో ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చింతలపూడి : నేటి బాలికలు అన్ని రంగాల్లోను పోటీపడి అభివృద్ధి సాధిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు మాటూరి చక్రధరరావు అన్నారు. జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఘనంగా జరుపుకున్నారు. మహిళా ఉపాధ్యాయులు సుజాత, కమలా ప్రియదర్శిని ఆడపిల్లలు చదువుకుంటే దేశ భవిష్యత్తు ఎలా ఉంటుందో చిత్రం ద్వారా తెలియచేశారు. దిశయాప్, నిర్భయ చట్టం, బేటీ బచావో, బేటీ పడావో తదితర పథకాలను బాలికలకు వివరించారు. బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చక్రధరరావు పిలుపునిచ్చారు. బాలికలు పుట్టుకతోనే వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్ల పుట్టగానే తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారని, అటువంటి ఆలోచనలకు స్వస్తి పలకాలన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం నేరమన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో బాలికలకు సంరక్షణ, వారికి హక్కులు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, గస్ బాబు, శ్రీరామమూర్తి, సతీష్ కుమార్, నల్లమోతుల సత్యనారాయణ, పల్లాలు, మురళీకృష్ణ, సరిపల్లి నాగేశ్వరరావు, రమేష్, శ్రీనివాసరావు, విజయకుమారి, చైతన్య, రాధిక, జయశ్రీ, సీహెచ్ సత్యనారాయణ, బాలాజీ పాల్గొన్నారు.


పంగిడిగూడెంలో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మహాలక్ష్ముడు


చింతలపూడిలో బాలికా సంరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ద్వారకాతిరుమల : పంగిడిగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలను జరిపారు. విజేతలకు సర్పంచ్ ప్రత్తిపాటి మహాలక్ష్ముడు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్త్రీల పాత్రను వివరించారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తేనే సమాజం మరింత బలిష్టమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.లీలాకుమార్, మహిళా పోలీసులు మహ్మద్ నసీమా, కుమారి, దొప్పసాని లక్ష్మి, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్‌తో మంచి ఫలితాలు



సంద్రకుంటలో డ్రోన్ స్ప్రేయింగ్ విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏవో దుర్గారమేష్

ద్వారకాతిరుమల : డ్రోన్ స్ప్రేయింగ్ విధానం ద్వారా వరి సాగులో మంచి ఫలితాలు సాధించొచ్చని మండల వ్యవసాయ అధికారి దుర్గారమేష్ అన్నారు. బుట్టాయిగూడెం గ్రామంలో రైతులకు మంగళవారం డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన, డెమోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఎంటర్ సేవా పథకం కింద ప్రతి మండలానికి మూడు డ్రోన్లు సబ్సిడీపై అందిస్తున్నారని, యూనిట్ ఖరీదు రూ.10 లక్షలు కాగా, అందులో రూ.4 లక్షలు సబ్సిడీ రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ ఉపయోగించడానికి గ్రూపులో ఒకరికి ప్రభుత్వం పైలెట్ శిక్షణ ఇస్తుందన్నారు. అనంతరం సత్తాల పంచాయితీ సంద్రకుంటలో రైతులకు డ్రోన్ స్ప్రేయింగ్‌పై డెమో ఇచ్చారు. కార్యక్రమంలో బుట్టాయిగూడెం సర్పంచ్ వెంకట సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముల్లంగి ఈశ్వరరెడ్డి, సత్తాల సర్పంచ్ కొండాబత్తుల సుభద్ర, గిరి, వీఏఏ పి.జ్యోతి, జంగారెడ్డిగూడెంకు చెందిన టీజీ రాజు, దినేష్ పాల్గొన్నారు.

1 నుంచి నరసింహస్వామి కల్యాణోత్సవాలు


సుందరగిరిపై విశేష అలంకారంలో దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. అందుకు భారీగా ఏర్పాట్లు చేయనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 1న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 3న ఉదయం కొండ కింద కల్యాణ మండపంలో స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు. 4న సాయంత్రం గ్రామోత్సవం, 5న పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, పూర్ణాహుతి వేడుకలు జరుగుతాయి. 6న జరుగనున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ తెలిపారు. వేడుకల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : కులం పేరుతో దూషించిన నేరంపై మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం కామవరపుకోట గ్రామానికి చెందిన మన్న నరేంద్ర, రత్నదుర్గ భార్యభర్తలు కాగా, వారి కాపురంలో ఇబ్బందుల నేపథ్యంలో పెద్దలతో కలిసి నిట్ట రోహిత్ అనే వ్యక్తి తగువు తీర్చేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో రత్నదుర్గ కులం పేరుతో రోహిత్‌ను దూషించిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.భీమశేఖర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం కొత్తపేటకు చెందిన దారం గణేష్‌కుమార్, శ్యామల భార్యాభర్తలు. వీరు తరచుగా గొడవలు పడుతున్నారు. ఈ నెల 20న భార్యభర్తలు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 22న కూడా వాగ్వివాదం జరగగా, రామచంద్రాపురంలో ఉన్న ఫొటోస్టూడియోకు గణేష్‌కుమార్ వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ రావడంతో శ్యామల పోలీసులకు ఫిర్యాదు చేసింది.